సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం ၊ 24 ၊ జూన్ ၊ 2023



వాణిజ్య బ్యాంకులతో సమానంగా డీసీసీబీ సేవలు

వాణిజ్య బ్యాంకులతో సమానంగా డీసీసీ బ్యాంకు సేవలందిస్తుందని డీసీసీబీ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి అన్నారు. -10లో



అన్ని విభాగాలు అభివృద్ధి సాధించాలి

వైవీయూలోని అన్ని విభాగాలు అభివృద్ధి సాధించాలని వీసీ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. -10లో



హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష

మైదుకూరులో 9 ఏళ్ల కిందట జరిగిన ఒక హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. -10లో

న్యూస్‌రీల్

వైవీయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 2, 4, 5వ సెమిస్టర్ విద్యార్థులకు, ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా వ్యాప్తంగా 57 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాలను వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తనిఖీ చేశారు. కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాల, ఖాజీపేటలోని సాహిత్య డిగ్రీ కళాశాలలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో మాట్లాడి పరీక్షల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 42,300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణలో స్వల్ప మార్పులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో స్వల్ప మార్పులు చేశారని జిల్లా ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు వేడి అన్నానికి బదులుగా జులై 1 నుంచి ప్రతినెల ఇంటికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌తోపాటు టేక్ హోం రేషన్ అందజేస్తారన్నారు. ఇందులో మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర కిలో నూనె, 25 కోడిగుడ్లు, ఐదు లీటర్ల పాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రతినెల మొదటి విడతలో (1 నుంచి 15వ తేది వరకు) బియ్యం మూడు కిలోలు, కిలో కందిపప్పు, అర లీటరు నూనెతోపాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణకిట్‌లో జొన్న పిండికి బదులుగా రాగి పిండి రెండు కిలోలు, అటుకులు కిలో, బెల్లం 250 గ్రాములు, వేరుశనగ చిక్కీలు 250 గ్రాములు, ఎండు ఖర్జూరాలు 250 గ్రాములు, కోడిగుడ్లు 13, పాలు 2.5 లీటర్లు అందజేస్తారన్నారు. రెండవ విడతలో 16వ తేది నుంచి నెలాఖరు వరకు 12 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు అందజేస్తారన్నారు.

క్రీడా పాఠశాల జిల్లాస్థాయి ఎంపికలు ప్రారంభం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 4వ, 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాఎంపికలకు విద్యార్థుల నుంచి ఆశించిన మేరకు స్పందన రాలేదు. శుక్రవారం జిల్లా స్థాయి ఎంపికలను డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం శనివారం సైతం జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలి పారు. అనంతరం ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, మెడిసినల్ బాల్‌త్రో, షటిల్ రన్, 800 మీటర్ల పరుగు పందెం క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించారు. కాగా తొలిరోజు శుక్రవారం నిర్వహించిన ఎంపికలకు 25 మంది విద్యార్థులు హాజరయ్యారు.

జగనన్న సురక్షతో సంతృప్త పరిష్కారం

- జిల్లా కలెక్టర్ విజయరామరాజు
- తాడేపల్లి నుంచి 'జగనన్న సురక్ష' పథకాన్ని ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు.. సంక్షేమ పథకాల ఫలాలు
- ఈ నెల 24 నుంచి నెలరోజుల పాటు కార్యక్రమం నిర్వహణ
- '1902'తో హెల్ప్ డెస్క్ ద్వారా.. సందేహాల నివృత్తి



సీఎం ప్రసంగాన్ని ఆలకిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు (ఇన్‌సెట్) వీసీలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కడప సెవెన్ రోడ్స్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలతో పాటు.. ప్రజా సమస్యలకు సంతృప్త స్థాయిలో పరిష్కారం చూపడమే.. 'జగనన్న సురక్ష' పథకం ప్రధాన ఉద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. 'జగనన్న సురక్ష' పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా లాంఛనంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

- ఈ కార్యక్రమానికి స్థానిక జిల్లా కలెక్టరేట్ వీసీ హాలు నుండి జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజుతో పాటు ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జేసీ గణేష్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారులు పి.శివ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ బి. విజయలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డీఆర్వో గంగాధర గౌడ్, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.
- సీఎం వీసీ అనంతరం కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన ఏ ఒక్కరూ లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందన్నారు. ఇప్పటికే.. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా.. ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా పరిష్కరించే దిశగా చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

జగనన్న సురక్ష పథకం నిర్వహణ ఇలా...

వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, జగనన్న మీద, జగనన్న ప్రభుత్వం మీద ప్రేమ, అభిమానం ఉన్న ఉత్సాహవంతులతో కూడిన టీమ్ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటినీ సందర్శిస్తుంది. అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి అందని వారుంటే వారిని గుర్తించి సమస్య పరిష్కారానికి కావల్సిన పత్రాలు సేకరిస్తారు. వారికేమైనా కుల, ఆదాయ, జనన మొదలైన సర్టిఫికెట్లు అవసరమైతే వాటికి అవసరమైన పత్రాలను తీసుకుని దరఖాస్తులను దగ్గరుండి పూర్తిచేస్తారు.

సంతృప్త స్థాయిలో సమస్యలకు పరిష్కారం అందేలా..

ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను సచివాలయానికి తీసుకెళ్లి వాటిని అక్కడ సమర్పించి, టోకెన్ నంబర్, సర్వీస్ రిక్వెస్ట్ నంబరు తీసుకుని వాటిని తిరిగి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తారు. ఈ క్యాంపులు ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తారో ముందుగానే తెలియజేస్తారు. ఆ రోజు దగ్గరుండి క్యాంపు వద్దకు తీసుకెళ్తారు. సమస్య పరిష్కారమయ్యేలా పర్యవేక్షణ చేస్తారు.

జూలై 1వ తేదీ నుండి క్యాంపుల నిర్వహణ..

మండల స్థాయి అధికారులైన తహశీల్దార్, ఈఓపీఆర్డీ ఒక టీమ్ కాగా.. ఎంపీడీఓ, డిప్యూటీ తహశీల్దార్ రెండో టీమ్‌గా ఏర్పడి సచివాలయంలో ఒకరోజు పూర్తిగా గడిపేలా చూస్తారు. జూలై 1 నుంచి ప్రతి సచివాలయంలో క్యాంపు నిర్వహించి అక్కడికక్కడే పథకాల సమస్యలను పరిష్కరించడంతోపాటు సేవా చార్జీలు లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లను అందిస్తారు.

ఎలాంటి సర్వీసు రుసుము లేకుండానే..

జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, లావాదేవీ మ్యుటేషన్లు, ఫోన్ నంబర్‌కు ఆధార్ అనుసంధానం, పంట సాగు కార్డులు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు వంటి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా జారీతో పాటు మరే ఇతర అవసరమైన సర్టిఫికెట్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో అందించనుంది.

జిల్లాలో 'జగనన్న సురక్ష' వివరాలు..

జిల్లాలో ప్రజలకు అన్ని విధాలా లబ్ధి చేకూరేలా జూలై 1 నుంచి 423 గ్రామ సచివాలయాలు, 226 వార్డు సచివాలయాల పరిధిలో జిల్లా వ్యాప్తంగా సురక్ష క్యాంపులు నిర్వహించనున్నారు. ఇందులో ఆయా పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వోద్యోగులు, వలంటీర్లు పాల్గొంటారు. అంతేకాకుండా జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేక ఐఏఎస్ అధికారితో పాటు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు ఈ సురక్ష క్యాంపుల నిర్వహణను పర్యవేక్షణ, రోజువారీ సమీక్ష చేయడం జరుగుతుంది. అంతేకాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఈ కార్యక్రమ పురోగతిపై ప్రతీ వారం సమీక్ష నిర్వహిస్తారు.

▶▶ 1902 హెల్ప్ డెస్క్ ద్వారా సేవలు..

వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు.. ఇళ్లను సందర్శించినప్పుడు ఇంటి యజమాని ఇంటివద్ద లేకపోయినప్పటికీ వారికి సమీపంలో క్యాంపు జరిగే రోజు నేరుగా అక్కడకు వెళ్లినట్లయితే వలంటీర్లతో కూడిన ఈ టీమ్ '1902' హెల్ప్‌డెస్క్ ద్వారా అవసరమైన సహాయం అందిస్తుంది. ఇక గ్రామంలో.. సచివాలయ పరిధిలో ఏ రోజు ఈ కార్యక్రమం జరుగుతుందో తెలుసుకోవాలంటే టోల్ ఫ్రీ నంబర్ '1902' కి కాల్ చేయాలి. లేదా https://vswsonline.ap.gov.in/#/home వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలియజేస్తున్నారు.

'విశ్వ'విద్యాలయంగా ఏఎఫ్‌యూ

- వివిధ రకాల అనుమతులతో పరిపూర్ణ విశ్వవిద్యాలయంగా మార్పు
- తాజాగా కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనుమతులు



వీసీ, రిజిస్ట్రార్‌లతో సమావేశమైన సీఓఏ అధికారులు

ఏఎఫ్‌యూ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శనం మేరకు కడప నగరంలో ఏర్పాటైన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం అనతికాలంలోనే అన్ని అనుమతులు సాధించి పరిపూర్ణ విశ్వవిద్యాలయంగా మారింది. తాజాగా శుక్రవారం విశ్వవిద్యాలయానికి కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) బృందం విచ్చేసి విశ్వవిద్యాలయాన్ని పరిశీలించి కౌన్సిల్ అనుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత నెల (మే) 12న ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫార్ టెక్నికల్ ఎడ్యుకేషన్) అధికారులు వర్చువల్ విధానంలో పాల్గొని విశ్వవిద్యాలయానికి గుర్తింపు ఇచ్చేందుకు అంగీకరించారు. దీనికి సంబంధించి అనుమతి పత్రాలు ఈనెలాఖరు లోపు రానున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు పేర్కొన్నారు.

విశ్వవిద్యాలయం సందర్శన..

వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) అధికారులు పరిశీలించారు. సీఓఏ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ నవీన్‌శర్మ (రాయపూర్), ఆర్కిటెక్ పుష్కర్ కన్విండే (పూణే)లు విశ్వవిద్యాలయంలో ఆర్కిటెక్చర్ కోర్సుకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, ల్యాబ్‌లు, ప్రవేశాలు, పరీక్షా ఫలితాలు, సాంకేతిక అంశాలను పరిశీలించారు. అనంతరం వీసీ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్ రెడ్డిలను కలిసి చర్చించారు.

జిల్లా వాసులకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

కడప కల్చరల్ /ప్రొద్దుటూరు : వైఎస్సార్ జిల్లాకు చెందిన ఇద్దరు యువ సాహితీవేత్తలకు 2003 సంవత్సరానికిగాను కేంద్ర సాహిత్య అకాడమీ యువ సాహితీ పురస్కారాలు లభించాయి. పులివెందులకు చెందిన తక్కెడ శిల జానీకి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం, ప్రొద్దుటూరుకు చెందిన యువ రచయిత, బాల సాహిత్యవేత్త, ఉపాధ్యాయుడు డీకే చదువులబాబులకు కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం లభించాయి. వీరికి ఈ పురస్కారాలు లభించడం పట్ల రాష్ట్ర అధికారభాషా సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య హర్షం వ్యక్తంచేస్తూ అభినందనలు తెలిపారు.

- కేంద్ర సాహిత్య అకాడమీ-2023 సంవత్సరానికిగాను ప్రకటించిన పురస్కారాల్లో యువ, బాల సాహిత్య పురస్కారాలు రెండూ వైఎస్సార్ జిల్లా వాసులకే దక్కడం జిల్లా సాహిత్య ఖ్యాతి మరింత ఇనుమడించిందని ఆయన ప్రశంసించారు.
- 2011లో జిల్లాకు చెందిన సాహితీవేత్త వేంపల్లె గంగాధర్, 2012లో వేంపల్లె షరీఫ్‌లకు కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారాలు లభించగా, ప్రస్తుతం తక్కెడ శిల జానికి ఈ పురస్కారం లభించడంతో.. జిల్లాలో ఈ విభాగంలో మూడు పురస్కారాలు లభించినట్లయింది.
- 1996లో జిల్లాకు చెందిన సీనియర్ కథకులు కేతు విశ్వనాథ రెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం లభించింది.

▶▶ డీకే చదువుల బాబు



ఈయన ప్రొద్దుటూరుకు చెందిన సాహితీవేత్త. తెలుగు ఉపాధ్యాయుడైన డీకే చదువుల బాబు కవి, రచయితగా ముఖ్యంగా బాల సాహితీవేత్తగా సుపరిచితులు. ఆయన రచించిన వజ్రాల వాన, బాలల కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కారం లభించింది. 1967 జూన్ 1న వైఎస్సార్ జిల్లా పెద్దముడియంలోని పెద్ద పసుపుల గ్రామంలో జన్మించారు. డి.దస్తగిరమ్మ, ఖాసింసాహెబ్ తల్లిదండ్రులు. కమలాపురం మండలం పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూలులో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు. 1983లో బొమ్మరిల్లు బాలల పత్రికలో బాలల కోసం రాసిన కథ ప్రచురితమైంది. నాటి నుంచి ఇప్పటివరకు దాదాపు అన్ని ప్రముఖ దిన, వార, మాస పత్రికల్లో 700కు పైగా బాలల కథలు, 100కు పైగా కవితలు, 50కి పైగా బాలల గేయాలు, వ్యాసాలు, సాంఘిక కథలు రాశారు. కొన్ని నాటికలు కూడా రాశారు. వీరి రచనలు మనరాష్ట్రంలోని 3, 5, 6 తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నాయి. కొన్ని ఆంగ్ల, కన్నడ భాషల్లో అనువాదం అయ్యాయి. బాల సాహిత్య సాంస్కృతిక సేవా సమితిని 2012లో స్థాపించి విద్యార్థులను కథా, గేయ, వ్యాస, పద్య రచనల్లో ప్రోత్సహిస్తున్నారు. కథా, గేయ రచనలో శిక్షణ ఇస్తున్నారు. కేంద్ర సాహిత్య అకాడమి కార్యక్రమాల్లో పత్ర సమర్పణలు చేశారు. పలు పురస్కారాలు, సత్కారాలు, బిరుదులు అందుకున్నారు.

▶▶ తక్కెడశిల జానీ



ఈయన 1991 జూన్ 8న వైఎస్సార్ జిల్లా పులివెందులలో జన్మించారు. తక్కెడ శిల ఆశా, చాంద్‌బాషా తల్లిదండ్రులు. జానీ ప్రాథమిక విద్య పులివెందుల, ప్రొద్దుటూరులో అభ్యసించి.. పులివెందుల పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చేశారు. కడపలో ఎంటెక్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. 2016 నుంచి ప్రతిలిపి తెలుగు విభాగం ప్రతినిధిగా సేవలు అందిస్తున్నారు. ఈయన రచించిన అఖిలాష కవితా సంపుటికి పురస్కారం లభించింది. ఈయన విప్లవ సూర్యుడు, నక్షత్ర జల్లులు, బురద నవ్వింది, గాయాల నుండి పద్యాల దాక, పరక తదితర పుస్తకాలు, వై, ఊరి మధ్యలో బొడ్రాయి తదితర దీర్ఘకావ్యాలు, ఘురు కథల సంపుటి వెలువరించారు. వివేచని, అకాడమి ఆణిముత్యాలు, కవిత్వ స్వరం తదితర సాహిత్య విమర్శ గ్రంథాలు వెలువరించారు. హిందీలో జిందగీకే హీరే పేరిట నానిలను రాశారు. కొన్ని రచనలకు సంపాదకత్వం వహించారు. బాల సాహిత్య విమర్శన గ్రంథాలు రాశారు. హిందీ, ఇంగ్లీషు, కన్నడం, ఒరియా, మళయాళం, తమిళ భాషల్లో ఆయన కవిత్వం అనువాదమైంది. 300 పుస్తకాలపై సాహిత్య విమర్శలు, 30 కథలు, 700కు పైగా కవితలు, మూడు నవలలు, మరికొన్ని రచనల అనువాదాలు చేశారు.

బుర్ఖా ధరించి.. మాటువేసి..

- కడప నగరంలో సినీ ఫక్కీలో వైఎస్ఆర్‌సీపీ నేత దారుణ హత్య
- జిమ్‌కు వచ్చిన శ్రీనివాసులరెడ్డిని కాపుకాసి హతమార్చిన దుండగులు
- పథకం ప్రకారం నడిరోడ్డుపై కత్తులతో దాడి
- మృతుడి శరీరంపై పది కత్తి పోట్లు
- స్థలాలు, ఆర్థిక లావాదేవీలే కారణమని ప్రాథమిక సమాచారం
- హత్యకు ఆ ఐదుగురే కారణమని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు
- పరామర్శించిన ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి
- కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు





శ్రీనివాసుల రెడ్డి మృతదేహం (ఇన్‌సెట్) (ఫైల్ ఫొటో)



హత్య జరిగిన ప్రదేశంలో స్వాధీనం చేసుకున్న కొడవలి



కడప రిమ్స్ మార్చురీ వద్ద బంధువుల ఆవేదనను వింటున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

సాక్షి ప్రతినిధి, కడప/ కడప అర్బన్: కడప నగరంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యారు. సంధ్యా సర్కిల్ – ఎర్రముక్కపల్లి ప్రధాన రహదారిలో శుక్రవారం ఉదయం 8:10 గంటల సమయంలో వైఎస్ఆర్‌సీపీ నేత చిన్ననాగిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి (42)ని దారుణంగా వేట కొడవళ్లతో, కత్తులతో దారుణంగా హత్య చేశారు. సినీ ఫక్కీలో దుండగులు దారుణానికి పాల్పడ్డారు. శ్రీనివాసుల రెడ్డి రోజుమాదిరిగా సంధ్యా సర్కిల్ సమీపంలో ఉన్న జిమ్‌కు వెళ్లి వస్తుండగా, ఆ భవనం కిందనే బురఖాలు ధరించిన దుండగులు వేట కొడవళ్లు, కత్తులతో మాటు వేసి నరికి, పొడిచి చంపారు. దాదాపు 10 కత్తిపోట్లు మృతుని శరీరంపై ఉన్నాయి. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులరెడ్డి సంధ్యాసర్కిల్ వైపు వంద మీటర్ల మేరకు పరుగులు తీసి కుప్పకూలిపోయాడు. ఈ విషయం తెలిసిన వెంటనే అతని భార్య మౌనిక సంఘటన స్థలానికి చేరుకుంది. స్థానికుల సహకారంతో శ్రీనివాసులరెడ్డిని రిమ్స్‌లో వైద్య సేవల కోసం చేర్పించారు. రిమ్స్‌కు చేరుకున్న కొద్దిసేపటికే శ్రీనివాసులరెడ్డి చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి.

వల్లూరు మండలం చిన్ననాగిరెడ్డిగారిపల్లెకు చెందిన చిన్ననాగిరెడ్డి శ్రీనివాసులరెడ్డి (42), ఖాజీపేట మండలం తిప్పాయపల్లె గ్రామానికి చెందిన మౌనికకు 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి 9వ తరగతి చదువుతున్న మహాదీప్ రెడ్డి (14), 7వ తరగతి చదువుతున్న హనుదీప్‌రెడ్డి(12) సంతానం. వీరు కడప మారుతీనగర్‌లోని నాగార్జున స్కూల్‌లో చదువుతున్నారు. శ్రీనివాసులరెడ్డి మొదట్లో కడప ఒన్‌టౌన్ సర్కిల్‌లో ఉన్న విజయ హోటల్‌లో క్యాషియర్‌గా పనిచేసేవాడు. తరువాత గత ఐదారేళ్ల నుంచి స్థలాల వ్యాపారం, ఇతర చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం మారుతీనగర్‌లో ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా, ఐసీడీఎస్ కడప కార్యాలయం పక్కన ఓ ఇంటిలో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో అతనితో పాటు సహచరులుగా వున్న వారితో ఇటీవల వ్యాపార, ఆర్థిక లావాదేవీలలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. శ్రీనివాసులరెడ్డి రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం సంధ్యాసర్కిల్ సమీపంలో ఎర్రముక్కపల్లి దారిలో ఎడమవైపున వున్న రాబిట్ జిమ్‌కు వ్యాయామ సాధన కోసం వచ్చాడు. కదలికలు గమనించి అంచనాకు వచ్చిన దుండగులు జిమ్ సమీపంలో బురఖాలు ధరించి మాటు వేశారు. జిమ్ నుంచి శ్రీనువాసులరెడ్డి బయటకు రాగానే మారణాయుధాలతో ఒక్కమారుగా అతడిపై దాడి చేసి దారుణంగా నరికారు. కత్తిపోట్లకు గురైన శ్రీనివాసులరెడ్డి దుండగుల నుంచి రక్షించుకునేందుకు కొద్ది దూరం పరుగెత్తి కుప్పకూలిపోయాడు. రక్తపుమడుగులో తీవ్రగాయాలతో పడిపోయిన అతన్ని వదిలేసి, నిందితులు పరారయ్యారు. సమాచారం అందుకున్న శ్రీనివాసులరెడ్డి భార్య మౌనిక సంఘటన స్థలానికి చేరుకుంది. స్థానికుల సహకారంతో భర్తను 108లో రిమ్స్‌లో చేర్పించారు. రిమ్స్‌కు చేరుకోగానే కొంతసేపటికే శ్రీనివాసుల రెడ్డి మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాసుల రెడ్డి హత్యకు నిందితులతో వున్న ఆర్థికలావాదేవీలు, స్థలాల తగాదాలేనని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

ఐదుగురిపై అనుమానంతో మృతుని భార్య మౌనిక ఫిర్యాదు

తన భర్తకు అనుచరుడిగా తిరుగుతూ ఇటీవల దూరంగా ఉంటున్న మోపూరి ప్రతాప్‌రెడ్డితో పాటు, పాలెంపల్లి సుబ్బారెడ్డి, జమీల్ మొబైల్స్ అధినేత జమీల్, గుంటి నాగేంద్ర, విశ్వనాథ రెడ్డిలపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుని భార్య మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, రవీంద్రనాథరెడ్డి, అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డి

శ్రీనివాసులరెడ్డి హత్య పట్ల కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రతి రోజూ ఆప్యాయంగా పలుకరిస్తూ వున్న శ్రీనివాసులరెడ్డి హత్యకు గురై తమ మధ్యలో లేడనే విషయం తెలుసుకుని జీర్ణించుకోలేకపోయారు. సంఘటన జరిగిన వెంటనే రిమ్స్‌కు చేరుకుని హత్య జరిగిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకుని భార్య బిడ్డలను ఓదార్చారు.

డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, అబ్బిరెడ్డి వీరారెడ్డిలు, వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు, బంధువులు కడప రిమ్స్ మార్చురీ వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ హత్యకు కారణమైన వారిని చట్టపరంగా శిక్షించాలని వారు పోలీసులకు సూచించారు.

నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు

శ్రీనివాసులరెడ్డి హత్య ఘటనపై ప్రజాప్రతినిధులు సీఎం కార్యాలయంకు, డీజీపీకి, జిల్లా ఎస్పీకి సమగ్రంగా విచారించాలనీ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్వి నాగరాజు, ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి, ఇతర సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

సిగ్గు.. సిగ్గు

సీఎం సొంత జిల్లా కడపలో శాంతి భద్రతలు క్షీణించిపోయాయి. పట్టపగలే కడపలో నడిరోడ్డుపై హత్యతో ప్రజలు భయబ్రాంతులకు గురయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అరాచకాలు మితిమీరుతున్నాయి. జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకుల అండదండలతోనే హత్యలు జరుగుతున్నాయి ... - టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి

- టీడీపీ నేతల హత్యాకాండ వైఎస్సార్‌సీపీకి రుద్దేయత్నం
- పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి వ్యాఖ్యలపై జనం మండిపాటు



చంద్రబాబునాయుడుతో జమీల్, సుబ్బారెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప: కడపలో ఓ సామెత ఉంది. 'మొగుణ్ణి కొట్టి మొగసాల ఎక్కింద'ంటారు. అచ్చం అలాగే టీడీపీ నేతల చర్యలుండిపోయాయి. వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులరెడ్డిని నడిరోడ్డుపై దారుణంగా హత్య చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అంశమే. ఆ ముసుగులో రాజకీయ ఆరోపణలే ధ్యేయంగా, ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి చర్యలుండడమే ఆక్షేపణీయం. శుక్రవారం హత్యకు గురైన శ్రీనివాసుల రెడ్డి సతీమణి మౌనిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా టీడీపీ వర్గీయులు కావడమే అందుకు నిదర్శనం. హత్యలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురిలో పాలెంపల్లె సుబ్బారెడ్డి, జమీల్, గుంటి నాగేంద్ర ముగ్గురు కూడా టీడీపీ నేత నారా లోకేష్ యువగళం కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. కడప నగరంలో వివిధ టీడీపీ నేతలకు విచ్చలవిడిగా ఫ్లెక్సీలు వేశారు. అనేక సందర్భాల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలతో ఫోటోలు సైతం దిగారు. కడప నియోజకవర్గంలో టీడీపీలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఆ ముగ్గురు హత్యారోపణలు ఎదుర్కొంటుండగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకుల అండదండలతో హత్యలు జరుగుతున్నాయని పత్రికా ప్రకటన విడుదల చేయడం గమనార్హం. నవ్విపోదురు గాక...నాకేటి సిగ్గు అన్నట్లుగా శ్రీనివాసులరెడ్డి చర్యలుండిపోయాని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

సీపీఐ శిక్షణ తరగతులను విజయవంతం చేయండి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని వీరపునాయునిపల్లె మండలం సంగమేశ్వర దేవాలయం వద్ద శనివారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణా తరగతుల్లో భారత స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర, రాయలసీమ సమగ్రాభివృద్ధిపై చర్చించి ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేశు హాజరు కానున్నట్లు తెలిపారు.

చెక్‌పోస్ట్ వద్ద విధులు సక్రమంగా నిర్వర్తించండి


చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ కృష్ణారావు

పులివెందుల రూరల్ : మండల పరిధిలో ఉన్న చెక్‌పోస్టుల వద్ద పోలీసులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని అడిషనల్ ఎస్పీ కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని కడప రోడ్డు, ముదిగుబ్బ రోడ్డు, ముద్దనూరు రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శుక్రవారం సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది డ్రిల్ చేయాలన్నారు. అలాగే భాకరాపురంలోని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్న గార్డులను పరిశీలించి విధులలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఖైదీలకు వైద్య పరీక్షలు


రక్త పరీక్షలు చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కడప అర్బన్ : స్థానిక ప్రత్యేక మహిళా కేంద్ర కారాగారంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. పర్యవేక్షణాధికారి ఎ.కృష్ణవేణి, జైలర్ భువనేశ్వరి, డిప్యూటీ జైలర్ ఎస్.ఇమాంబి, మహిళా జైలు డాక్టర్ శ్రీవాణి, ఉషారాణి, మహిళా జైలు సిబ్బంది ఆధ్వర్యంలో హెచ్ఐవీ, టీబీ, సిఫిలిస్, హెపటైటిస్ బి, సి అనే ఐదు రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.కె. ఖాదర్ వల్లీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ వ్యాధుల లక్షణాలు, నిర్ధారణ, నివారణ చర్యలను చేపట్టారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణుల దాడి

ఇద్దరు వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలు


మాధవనాయుడు నిర్మించుకుంటున్న ఇంటి స్థలం



కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మాధవ నాయుడు, గాయపడిన మల్లేశ్వరి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో ఇంటి స్థల విషయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మాధవ నాయుడు, ఆయన కుటుంబ సభ్యులపై శుక్రవారం కొమ్మినేని సుబ్బయ్య, మరికొంత మంది కలిసి దాడి చేశారు. ఈ సంఘటనలో మాధవనాయుడుకు చేయి విరగగా, ఆయన మరదలు మల్లేశ్వరి తలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కమ్మవారిపల్లె గ్రామ పొలంలోని సర్వే నంబర్ 810లో గత కొంత కాలంగా మాధవనాయుడు కుటుంబీకులు కలం ఏర్పాటు చేసుకున్నారు. క్రమేణా ఇంటి స్థలాలకు ఉపయోగపడుతుందని, అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ముద్దు కృష్ణంనాయుడు సుబ్బయ్య నాయుడును ఉసిగొల్పి ఆ స్థలంలో నీకు కూడా భాగం ఉందని నకిలీ పత్రాలను సృష్టించాడు. అయితే పూర్తి ఆధారాలు మాధవనాయుడు కుటుంబీకులకు ఉండటంతో వారు స్థానిక మండల వైఎస్సార్‌సీపీ నాయకులను, రెవెన్యూ, పోలీసు అధికారులను ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. అయితే ముద్దు కృష్ణంనాయుడు సలహా మేరకు ఫోర్జరీ సర్టిఫికెట్లతో సుబ్బయ్యనాయుడు కోర్టును ఆశ్రయించాడు. కోర్టు మాత్రం సమాధులు, దేవాలయాలు ఉంటే అక్కడ ఇంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఆదేశాలు ఇచ్చారే తప్ప.. ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టకూడదని చెప్పలేదని మాధవనాయుడు తెలిపారు. రెండు రోజుల క్రితం మాధవ నాయుడు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఇంటి నిర్మాణం చేసుకుంటానని కోరారు. ఆ స్థలానికి సంబంధించిన పూర్తి ఆధారాలు ఉన్నాయి కాబట్టి ఇంటి నిర్మాణం చేసుకోవచ్చని అధికారులు తనకు చెప్పారని మాధవనాయుడు ఇంటికి బేస్‌మెట్టం చేపట్టారు. శుక్రవారం ఎవరు లేని సమయంలో తనపై, సమీపంలో ఉన్న తమ తమ్ముడి భార్య మల్లేశ్వరి అక్కడికి రావడంతో ఆమెపై కూడా కట్టెలతో దాడి చేశారని మాధవనాయుడు తెలిపారు. కేవలం రాజకీయాల కోసమే తనపై దాడి చేశారని ఆయన చెప్పారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వంశీధర్ గౌడ్, రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ సంఘటన స్థలానికి చేరుకుని మాధవనాయుడు కుటుంబ సభ్యులను విచారణ చేశారు. ఆ సర్వే నంబర్‌కు సంబంధించిన ఆధారాలు ఎవరికి ఉన్నాయో పరిశీలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు సుబ్బనాయుడు, మరి కొంత మందిపై, మాధవనాయుడు మరి కొంత మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్ఆర్ క్రాంతి పథంలో గ్రామ సంఘాల నిధుల స్వాహా

- సీసీ చేతి వాటం
- రూ.30 లక్షలకు పైగా సొంత ఖాతాలకు మళ్లింపు

వల్లూరు : వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథంలో భారీగా జరిగిన నిధుల స్వాహా వెలుగు చూసింది. అక్కడ పని చేసిన సీసీ చేతి వాటం చూపి మండలంలోని పలు గ్రామ సంఘాలకు చెందిన నిధులను పెద్ద మొత్తంలో తన సొంత ఖాతాలకు మళ్లించిన విషయం ఆధారాలతో సహా బయట పడింది. వివరాలిలా వున్నాయి. వల్లూరు వైఎస్ఆర్ కేపీలో 2014 నుంచి సునీత సీసీగా పని చేస్తోంది. 2014 నుంచి 2019 వరకు మండలంలోని తప్పెట్ల క్లస్టర్‌కు, 2019 నుంచి ఇటీవల కమలాపురం బదిలీ అయ్యే వరకు గోటూరు క్లస్టర్‌కు సీసీగా ఆమె బాధ్యతలు నిర్వహించారు. ఆమె పని చేసిన గ్రామ సంఘాల నుంచి 2015 నుంచి నిధులను తన సొంత ఖాతాలకు మళ్లించడం మొదలు పెట్టింది. చాకచక్యంగా రికార్డులను నిర్వహిస్తూ ఏ ఒక్కరికీ అనుమానం రాకుండా క్రమంగా భారీ మొత్తంలో నిధులను మళ్లించింది.

తీగ లాగితే డొంక కదిలింది

ఇటీవల ఆమె పని చేస్తున్న గోటూరు క్లస్టర్ పరిధిలోని తోల్ల గంగనపల్లెకు చెందిన వీవోఏ రాజుకు గత సంవత్సర కాలంగా జీతాలు రాక పోవడంతో డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన పీడీ తమ నుంచి విడుదలవుతున్న జీతాల నిధులు ఏమవుతున్నాయో తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు గత నెల చివరి వారంలో ముగ్గురు లీగల్ కో ఆర్డినేటర్లు జీతం నిధులకు సంబంధించి తనిఖీలను నిర్వహించారు. అందులో నిధుల స్వాహా జరిగినట్లు గుర్తించారు. దీంతో ఆమె ఇటీవల బదిలీ అయ్యే వరకు పని చేసిన గోటూరు క్లస్టర్‌తోపాటు గతంలో పని చేసిన తప్పెట్ల క్లస్టర్‌లకు సంబంధించి జరిగిన లావాదేవీలపై పూర్తి స్థాయిలో తనిఖీలను నిర్వహించారు. ఇందులో భారీగా నిధుల మళ్లింపు జరిగినట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఆమె కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించారు.

30 లక్షలకు పైగా నిధుల మళ్లింపు

గోటూరు క్లస్టర్‌లోని తోల్లగంగనపల్లె, తప్పెట్ల క్లస్టర్ పరిధిలోని లేబాక -1, 2, దుగ్గాయపల్లె- 1, 2, తప్పెట్ల -1 , 2 గ్రామ సంఘాల నుంచి నిధుల మళ్లింపు జరిగినట్లు గుర్తించారు. మొత్తం ఈ 7 గ్రామ సంఘాల నుంచి ఆమె తన భర్త, పిల్లల బ్యాంకు ఖాతాలతోపాటు బంధువులు, కొంత మంది ఇతర వ్యక్తుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు సుమారు 30 లక్షల రూపాయలకు పైగా నిధులను మళ్లించినట్లు గుర్తించారు.

నా సొంత ఖాతాలకు మళ్లించిన నిధులను మాత్రమే చెల్లిస్తా

కాగా లీగల్ కోఆర్డినేటర్లు ఏపీఎంతోపాటు ఆయా గ్రామ సంఘాల వీవోఏలతో కలసి శుక్రవారం సంబంధిత సీసీని మండల సమాఖ్య కార్యాలయానికి పిలిపించారు. స్వాహా చేసిన నిధులను తిరిగి చెల్లించాలని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీసీ తన భర్త, పిల్లల ఖాతాలకు మళ్లించిన నిధులను మాత్రమే వడ్డీ లేకుండా చెల్లిస్తానని, ఇతర ఖాతాలకు మళ్లించిన నిధులతో తనకు సంబంధం లేదని బదులిచ్చినట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

దీనిపై ఏపీఎం శైలజను వివరణ కోరగా నిధుల స్వాహా జరిగిన మాట వాస్తవమేనని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంకా విచారణ కొనసాగుతోందని, పూర్తి కాగానే ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామని తెలిపారు. కాగా ఈ విషయంపై సీసీ సునీతను వివరణ కోరడానికి ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఫోన్ కాల్‌ను ఆమె లిఫ్ట్ చేయలేదు.

పీడీని కలువనున్న వీవోఏలు

కాగా నిధుల స్వాహా విషయం గురించి సంబంధిత వీవోఏలు పీడీని కలవడానికి సిద్ధమవుతున్నారు. ఈమేరకు నిధుల స్వాహాకు సంబంధించిన ఆధారాలను తీసుకుని పీడీకి అందజేసి తమ గ్రామ సంఘాలకు రావాల్సిన నిధులను రికవరీ చేయాలని కోరనున్నట్లు వారు తెలిపారు.

పది సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

- రాష్ట్రస్థాయిలో 6వ స్థానంలో నిలిచిన వైఎస్సార్ జిల్లా
- జిల్లాలో 5841 మందికిగాను 4424 మంది విద్యార్థులు పాస్

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతికి సంబంధించి ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసింది. ఫలితాల్లో వైఎస్సార్ జిల్లా రాష్ట్రంలో ఆరవ స్థానంలో నిలిచింది. జిల్లావ్యాప్తంగా 5841 మంది పరీక్షరాయగా ఇందులో 4424 మంది పాస్ అయి 75.75 శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఇందులో బాలురు 3396 మంది పరీక్షలు రాయగా 2463 మంది పాస్ అయి 72.53 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 2445 మంది పరీక్షరాయగా 1961 మంది పాస్ అయి 80.20 శాతం ఉత్తీర్ణత సాధించారు.

రీకౌంటింగ్ అండ్ రీవెరిఫికేషన్‌కు సంబంధించి...

పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు తమ జవాబు పత్రాల రీకౌంటింగ్ కోసం దరఖాస్తులను ఈనెల 29వ తేదీ లోపుగా సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలాన్ ద్వారా ఒక్కో సెబ్జెక్టుకు రూ. 500 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే జవాబు పత్రాల ఫొటోకాపీ యొక్క పునః ధ్రువీకరణ, సరఫరా కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలాన్ ద్వారా ప్రతి సబ్జెక్టుకు రూ. 1000 ఈనెల 29 లేదా అంతకు ముందే చెల్లించవచ్చన్నారు. అధికారిక వెబ్‌సైట్ www.bre.ap.gov.inలో అందుబాటులో ఉన్న దరఖాస్తును పూర్తిగా పూరించి సంతకం చేసిన రీ-వెరిఫికేషన్ /రీకౌంటింగ్ దరఖాస్తును సంబంధిత డీఈఓ కార్యాలయంలోని కౌంటర్లలో సమర్పించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. హెచ్ఎం లాగిన్‌లో ఫలితాలు ప్రకటించిన నాలుగు రోజుల తర్వాత మార్కుల జాబితా www. bre.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. హెడ్ మాస్టర్ సంబంధిత స్కూల్ లాగిన్ నుంచి స్కూల్ వారిగా తాత్కాలిక మార్కుల జాబితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. వ్యక్తిగత విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి నేరుగా తమ మార్కుల జాబితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి


జింకను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

ముద్దనూరు : మండలంలోని రాజులగురువాయపల్లె గ్రామ సమీపంలో శుక్రవారం కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందింది. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన జింకను స్థానికులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ అధికారులు మృతి చెందిన జింకను డాక్టర్ శ్రీనివాస్‌చే పోస్టుమార్టం నిర్వహించారు. జింకకు మూడు సంవత్సరాల వయసు ఉంటుందని, కుక్కలు దాడి చేయడంతోనే జింక మృతి చెందిందని నిర్ధారించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


మృతి చెందిన నారాసింగ్

సింహాద్రిపురం : మండల పరిధిలోని అగ్రహారం పొలంలో విద్యుత్ లైన్లు ప్రమాదవశాత్తు బోరు లారీకి తగిలి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నారాసింగ్ (19) అనే కూలీ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కూలీలు తమ బోరు బండి ద్వారా బోరు వేసేందుకు అగ్రహారం గ్రామానికి చెందిన రైతు పొలంలోకి వెళ్లారు. బోరు వేస్తున్న సమయంలో 33 కె.వి విద్యుత్ లైన్లు బోరు బండికి తగిలి విద్యుత్ సరఫరా అయి.. భూమిపై నిలిచి ఉన్న కూలీ లారీకి తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో ఆయన మృతి చెందాడు. తోటి కూలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు.

కడపకు బ్రహ్మంసాగర్ నీరు ఇవ్వడం సబబే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : కడప నగరానికి బ్రహ్మంసాగర్ నుంచి తాగునీటిని అందివ్వడం వల్ల రైతాంగానికి వచ్చే ఇబ్బందేమీ లేదని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. సోమశిల రిజర్వాయర్ నీటిని కాదని బ్రహ్మంసాగర్ నుంచి కడప నగరానికి నీరు ఇవ్వనుండటంపై వస్తున్న విమర్శలను శుక్రవారం మైదుకూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దృష్టికి విలేకరులు తీసుకుపోయారు. దానిపై స్పందిస్తూ తాగునీటిని అందించడమే ప్రభుత్వాల మొదటి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా కేంద్రమైన కడప నగరానికి బ్రహ్మంసాగర్ నుంచి నీటిని అందించడం సబబేనన్నారు. గతంలో సోమశిల ప్రాజెక్టు నుంచి నీరు అందించాలని అనుకున్నా, అది వర్షాకాలంలో మాత్రమే అనుకూలంగా ఉంటుందన్నారు. అదే బ్రహ్మంసాగర్ నీటిని అందివ్వడం సులభమన్నారు. ఇప్పటికే బ్రహ్మంసాగర్ నుంచి ఆర్టీపీపీకి నీరందించేందుకు వేసిన పైప్‌లైన్ ఉండటం వల్ల మైదుకూరు నుంచి కడప నగరానికి కేవలం 25 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీల నీరు ఉంటుందని, అందులో నుంచి ఒకటిన్నర టీఎంసీ నీటిని కడప నగరానికి ఇవ్వడం వల్ల రైతాంగానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన చెప్పారు. మైదుకూరు మండలంలో ఉన్న ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, బ్రహ్మంగారిమఠం మండలంలో ఉన్న బ్రహ్మంసాగర్‌లో ఎప్పటికీ నీళ్లు ఉంటాయని వివరించారు.

అన్ని విభాగాలు అభివృద్ధి సాధించాలి


వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలు అభివృద్ధి సాధించాలని, ఆయా విభాగాల్లో జరుగుతున్న అంశాలను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్ ద్వారా ప్రపంచానికి తెలియజేయాలని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలో జర్నలిజం, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ విభాగాల వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిశాఖ అకడమిక్‌గా బలోపేతం కావాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విభాగాల్లో జరిగే అభివృద్ధి, కార్యక్రమాల సమాచారం ఐటీ శాఖకు తెలియజేసి, ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ఐటీ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి.శంకర్, అధ్యాపకులు డాక్టర్ టి.శ్యాంస్వరూప్, డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి, డాక్టర్ జి.పార్వతి, డాక్టర్ గణేష్‌నాయక్, ఐటీ సెల్ ప్రతినిధులు అబ్దుల్ రఖీబ్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష

ఒక్కొక్కరికి రూ.1.5 లక్షల జరిమానా


శిక్ష పడిన ముగ్గురు ముద్దాయిలు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో 9 ఏళ్ల కిందట జరిగిన ఒక హత్య కేసులో ముగ్గురికి ప్రొద్దుటూరు రెండో ఏడీజే కోర్టు న్యాయమూర్తి జీఎస్ రమేష్ కుమార్ యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. అంతేకాక వారికి రూ.1.5 లక్షలు చొప్పున జరిమానా విధించారు. పట్టణంలోని వనిపెంట రోడ్డు విజయనగర కాలనీలో నివాసం ఉన్న భూమిరెడ్డి పెద్దవెంకటేశ్వర్లు(59) 2014 సెప్టెంబర్ 25వ తేదీన హత్యకు గురయ్యారు. అందుకు సంబంధించి అదే ప్రాంతంలో నివాసం ఉన్న పూజారి సత్యప్ప, అతని మేనల్లుడు కడప రమేష్, స్నేహితుడు కంపా రామయ్య అనే వారిపై అప్పటి అర్బన్ సీఐ బీవీ శివారెడ్డి కేసు నమోదు చేశారు. వనిపెంట రోడ్డులో హతుడు వెంకటేశ్వర్లు ఇంటికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పూజారి సత్యప్ప హోటల్ పెట్టుకుని జీవిస్తుండగా.. తన హోటల్‌కు వచ్చే కస్టమర్లకు హోటల్‌లో టిఫిన్ బాగలేదని చెబుతూ, స్థల యజమానికి చెప్పి ఖాళీ చేయిస్తానని పెద్ద వెంకటేశ్వర్లు అంటున్నాడని మనసులో కక్ష పెంచుకొని హత్య చేశారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన సీఐ శివారెడ్డి సాక్షాధారాలతో నిందితులకు శిక్షపడేలా చేశారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంప్రసాద్‌రెడ్డి వాదించారు. నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన ఇప్పటి అర్బన్ సీఐ చలపతి, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ కేకే అన్బురాజన్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేముల : మండలంలోని కె.కె.కొట్టాల గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన అన్నదమ్ములు రామచంద్రుడు, లక్ష్మీనారాయణ టీవీఎస్ ఎక్సెల్‌లో వేముల మండలంలోని కె.కె.కొట్టాల గ్రామానికి వెళ్లారు. అక్కడ లక్ష్మీనారాయణ కుమార్తెను చూసి తిరుగు పయనమయ్యారు. మార్గంమధ్యలో గుర్తు తెలియని వాహనం టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రామచంద్రుడు, లక్ష్మీనారాయణకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పులివెందుల ఆసుపత్రికి తరలించారు.


తాడేపల్లిలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని యూపీఎస్సీ విజేత కడపకు చెందిన కృపాకర్ కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనను అభినందించారు.

ఇసుక ట్రాక్టరు ఢీకొనడంతో మహిళ మృతి

రాజుపాళెం : రాజుపాళెంలో శుక్రవారం రాత్రి ఇసుక ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఆ గ్రామానికి చెందిన బూతూరు ఈశ్వరమ్మ (55) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ రాజగోపాల్ తెలిపారు. వివరాలిలా... ప్రొద్దుటూరు మండలంలోని చౌడూరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు రాజుపాళెం వద్ద పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని గమనించి డ్రైవర్లు తాము ఎక్కడ పట్టుబడతామేమోనని.. ఆ ట్రాక్టర్లను గ్రామంలోకి మళ్లించడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. అప్పుడే ఒక కార్యక్రమానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న ఈశ్వరమ్మను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటనపై మృతురాలు కుమారుడు బూతూరు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజగోపాల్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వాణిజ్య బ్యాంకులతో సమానంగా డీసీసీబీ సేవలు

- రైతులకు, బడుగు, బలహీన వర్గాలకు మరింత మెరుగైన సేవలు
- డీసీసీ బ్యాంకులో వివిధ స్కీములపై ఒక రోజు వర్క్‌షాపు
- హాజరైన ఐదు జిల్లాల డీసీసీ బ్యాంకు సిబ్బంది


సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : నేటి పోటీ ప్రపంచంలో వాణిజ్య బ్యాంకులతో సమానంగా డీసీసీ బ్యాంకు సేవలందిస్తుందని దీంతోపాటు రైతులు, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తోందని ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి అన్నారు. శుక్రవారం కడపలోని డీసీసీ బ్యాంకు కాన్ఫరెన్స్ హాలులో బ్యాంకుకు సంబంధించిన వివిధ స్కీములపై సీఈఓ కందుల రాజేంద్రకుమార్ అధ్యక్షతన, ఆప్కాబ్, సీటీఐ వారి ఆధ్వర్యంలో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, కడప డీసీసీబీ సిబ్బందికి ఒక్కరోజు వర్కుషాపు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ డీసీసీ బ్యాంకులు వాణిజ్య బ్యాంకులతో సమానంగా పనిచేయడమే ధ్యేయంగా చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే ఇలాంటి వర్కుషాపులు రాష్ట్రమంతటా నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు, బలహీన వర్గాలకు మరింత మెరుగైన సేవలు వేగవంతం చేయాలని సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ రుణాలు అందించడంలో డీసీసీబీ ముందుండాలన్నారు. ఆప్కాబ్ జనరల్ మేనేజర్ వెంకటరత్నం మాట్లాడుతూ నాబార్డు నుంచి రీఫైనాన్సు రేట్లు బాగా పెరిగాయని అందువలన డిపాజిట్ల సేకరణ చాలా అవసరం అన్నారు. అందుకోసం ప్రజలతో సిబ్బంది మమేకం కావాలని కోరారు. నాబార్డు డీడీఎం విజయ విహారి మాట్లాడుతూ డీసీసీబీలు కూడా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఈఓ కందుల రాజేంద్రకుమార్, ప్రొఫెషనల్ డైరెక్టర్ వీరారెడ్డి, ఆప్కాబ్ డీజీఎం కుమారి, జమున, సీటీఐ అధ్యాపకులు విజయచంద్రారెడ్డిలు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

సొసైటీలను లాభాల బాటలో నడిపించాలి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 77 సహకార సంఘాల ఉద్యోగులు సొసైటీ అభివృద్ధికి కష్టపడి పనిచేసి లాభాల బాటలో నడిపించాలని ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి సూచించారు. శుక్రవారం కడపలోని డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో హెచ్ఆర్ పాలసీ కోసం ఏపీపీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, అన్నమయ్య జిల్లా యూనియన్, వైఎస్సార్ కడప జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌లు కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప జిల్లా పరిధిలో ఉన్న అన్ని సహకార సంఘాల ఉద్యోగులకు జులై 1వ తేదీ నుంచి హెచ్ఆర్ పాలసీ పే స్కేల్ ప్రకారం జీతాలను ఇస్తామని దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తి చేశామన్నారు. కడప డీసీసీ బ్యాంకులో 2024 మార్చి నాటికి సహకార సంఘాల ద్వారా ఎవరైతే డిపాజిట్స్ వేస్తారో ఆయా మొత్తాలకు ప్రస్తుత వడ్డీ రేటుతోపాటు అదనంగా 1 శాతం ఎక్కువగా ఇస్తామన్నారు. సంఘాలలో పనిచేస్తున్న సిబ్బందికి ఇంతవరకు హెల్త్ ఇన్సూరెన్స్ కూడా లేనందున వారికి హెల్త్ ఇన్సూరెన్స్ రూ. 2 లక్షల వరకు కడప డీసీసీ బ్యాంకు సమకూరుస్తుందన్నారు. కాగా ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న హెచ్ఆర్ పాలసీకి ఇన్నాళ్లకు మార్గం సుగమం చేసినందుకుగాను వైఎస్సార్ జిల్లా, అన్నమయ్య జిల్లా యూనియన్ నాయకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు.

డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ మనం పనిచేసే సంస్థలు బాగుంటే మనం కూడా బాగుంటామన్నారు. సొసైటీ అభివృద్ధికి సిబ్బంది కష్టపడి పనిచేయాలన్నారు. దీంతోపాటు తమ పరిధిలోని బకాయిలను సకాలంలో వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. సలహాదారు సహదేవరెడ్డి, ప్రొఫెషనల్ డైరెక్టర్ వీరారెడ్డి, ఏపీపీఏసీఎస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీ రెడ్డిబాబు, వైఎస్సార్ యూనియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ బాబుసాని, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOTIVE

Mercedes Benz E220, Diesel, Rate: 9Lakhs 78000Km, HR Reg. 2013, Car in Kurnool for Inspection Friday, Saturday, Sunday. Ph: 9100005656. [HA-330]

EDUCATION

B.Tech / B.Pharmacy

AP EAPCET లో క్వాలిఫైడ్ స్టూడెంట్స్‌కు B.Tech, B-ఫార్మసీ నందు ఫ్రీ ఎడ్యుకేషన్, ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర : జి. మురళీ, 9030661651, ATP. [A-776713]

PARAMEDICAL

B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1631]

SERVICE

CHANGE OF NAME

I, KOVURU RAJAMMA (OLD NAME), R/o., H.No. 2/136-B, RAMNAGAR, RAJAMPET (T), (M), ANNAMAYYA (DT), A.P., HEREBY CHANGED MY NAME AS POTLADURTHI RAJAMMA (NEW NAME), W/o. P.RAMANAIAH. [C-1836]

MINI GEEZER

శ్రీ గాయత్రీ మినీ గీజర్స్ (5 sec.లో వేడి నీళ్ళు) సేల్స్ చేయుటకు డీలర్స్ కావలెను. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం. సంప్ర. సెల్ : 96663 32323, 95506 92836. [M-1221206]

సాయిరాం జ్యోతిష్యాలయం

పండిట్ సాయిరాం శాస్త్రి గారు మీ హస్త సముద్రికం చేసి సంపూర్ణ జ్యోతిష్యం చెప్పగలరు. విద్య, ఉద్యోగం, ధనప్రాప్తి, యోగం, స్త్రీ, పురుషులకు ఎటువంటి సమ్యలు ఉన్న సంప్ర: 6363643518. [C-785820]

BUSINESS OFFER

ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034424384 [H-189201]

WANTED

ఉమ్మడి కడప జిల్లా నందు పులివెందుల, వేంపల్లి, జమ్మలమడుగు, రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాలకు Beverage Product's సప్లై చేయుటకు Distributer's కావలెను. సంప్రదించవలసిన నెం: 8333811286. [C-785817]

శ్రీ లక్ష్మి మేఘన ఎంటర్‌ప్రైజెస్ – టాటా మోటార్స్ కడప నందు పనిచేయుటకు అనుభవం కలిగిన Army EME Crops, వెహికల్ మెకానిక్స్, సీనియర్ మెకానిక్స్ మరియు అసిస్టెంట్ టెక్నీషియన్స్ కావలెను. సంప్రదించండి: 75693 14429. [C-1191654]

TEACHERS WANTED To MONTFORT SCHOOL (B.Ed is must) Subject Teachers: For PRIMARY in MATHS HINDI, TELUGU, Walk in Interview Ph: 7995351591, 9010687003 ADMISSION OPEN. [C-785878]

WANTED Lecturer : Qualification: B.Tech (C.S.E), B.SC Nursing, Computer Operater: Qualification: Any Degree (M.S Office, Telugu, English Typing) Cont: 6281510785. [C-785818]

కడపలో ఉన్న షాపింగ్ మాల్ నందు హౌస్ కీపింగ్ బాయ్స్ కావలెను. చదువు - 10వ తరగతి, 9 గంటలు డ్యూటీ. జీతం: 9500, టైమ్: 12.30 నుంచి 10.00 వరకు, సంప్ర: 7702936190, 9014343552. [C-785819]

మా సంస్థను మీ జిల్లాలో అభివృద్ధి చేయుటకు మార్కెటింగ్ ఫీల్డ్‌లో అనుభవమున్న వారు కావలెను. Mega Group Manpower & Security. Cell : 70326 10569, 70931 25169. [NA-5711]

DHL International Cargo Courier Servicesలో వర్క్ చేయుటకు క్యాబిన్ క్రూ లోడింగ్ full సర్వీసెస్, Office Admin Supervisors, Ground Staff, Team Leaders కావలెను. Q: 10th to any Degree , డిప్లొమా ITI, Age: 18 to 35, Food + Room free. Salary: 25,000/- to 32,000/- Ph: 81255 60645 [B-1165197]

హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K హైదరాబాద్ : 9640258899, విజయవాడ: 9640648899 [HA-337]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705944423
9705907418
9010223797
9010072409